
సాక్షి బాపట్ల

ఆదివారం । 10 । మార్చి । 2024




మహాకాళేశ్వరుడికి అభిషేకం

ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరంలో కోటిఒక్కలింగాల క్షేత్రంలో శనివారం తెల్లవారుజామున మహాకాళేశ్వరుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు.



వైభవంగా కల్యాణం

సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో ఉన్న దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైభవంగా త్రికోటేశ్వరుని లింగోద్భవ పూజలు



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారికి లింగోద్భవ పూజలు వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి 12గంటల నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. విశేష ద్రవ్యాలు, పంచామృతాలు, విశేష ఫలాలతో నిర్వహించిన అభిషేకాల్లో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణ కొండలరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి లింగోద్భవ పూజలను తిలకించారు. తెల్లవారుజామున 3గంటల వరకు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, పలువురు అధికారులు పూజల్లో పాల్గొన్నారు.

18 నుంచి ఉచిత శిక్షణ

గుంటూరురూరల్: గుంటూరు నగర శివారులోని లాంఫాంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కె.వి.కె)లో నిరుద్యోగ యువతీ యువకుల కోసం పండ్లు, కూరగాయలతో విలువ ఆధారిత పదార్థాల తయారీ తదితర విషయాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కె.వి.కె. శాస్త్రవేత్త డాక్టర్ ఎం.దీప శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కార్యక్రమం వారం రోజులపాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు 9989051559 నంబర్‌కు ఈనెల 16వ తేదీలోగా ఫోన్‌చేసి వివరాలు తెలుసుకుని తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

13న ప్రధాని మోదీతో వర్చువల్‌గా ముఖాముఖి

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా ప్రధానమంత్రి సూరజ్ ప్రోగ్రాం కింద లబ్ధి పొందిన లబ్ధిదారులతో ఈనెల 13న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ముఖాముఖిగా సమావేశమవుతారని షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ (ఎస్సీ కార్పొరేషన్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి ప్రేమకుమారి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కెఎఫ్‌డీసీ, ఎన్‌టీసీఎఫ్‌డీసీ, ఆర్థిక సంస్థల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులతో 13న జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాలులో జరుగుతుందన్నారు.

12న రైల్వే కోచ్ రెస్టారెంట్ జాతికి అంకితం

గుంటూరు మెడికల్: రైల్వే అభివృద్ధిలో భాగంగా గుంటూరు రైల్వేస్టేషన్‌లో పశ్చిమ వైపు నిర్మాణం చేసిన రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 12న వర్చువల్‌గా రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేస్తారన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొంటారని వెల్లడించారు. రైల్వే అభివృద్ధి మోదీ హయాంలోనే జరుగుతోందని, చిన్న చిన్న రైల్వేస్టేషన్‌లను సైతం అభివృద్ధి చేశారని తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6200, గరిష్ట ధర రూ.8000, మోడల్ ధర రూ.7100 వరకు పలికింది.

జైత్ర యాత్రకు సిద్ధం

- వైఎస్సార్ సీపీ నాల్గవ సిద్ధం సభకు భారీగా తరలి వెళ్లనున్న పార్టీ కార్యకర్తలు, నేతలు, అభిమానులు
- ఇప్పటికే సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి లక్షలాదిగా వెళ్లే అవకాశం
- పార్టీ ఏర్పాటు చేసిన వాహనాలతో పాటు సొంత వాహనాలు సిద్ధం చేసుకున్న అభిమానులు
- ఇప్పటికే జోష్ మీద ఉన్న క్యాడర్‌లో సీఎం జగన్ సందేశంతో మరింత పెరగనున్న ఉత్సాహం

నేడు దారులన్నీ బాపట్ల జిల్లా పి.గుడిపాడు వైపే..



బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్ల సమీపంలో సిద్ధం సభావేదిక

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సిద్ధం... ఈ మాట వింటేనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమరోత్సాహంతో ఎన్నికల యుద్ధానికి కదం తొక్కుతున్నారు.. మరోవైపు ఈ సభలకు వస్తున్న ప్రతిస్పందన చూసి ప్రతిపక్ష నేతలు మాత్రం ఓటమి భయంతో వణికిపోతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం పేరిట ఇప్పటికే మూడు సభలు నిర్వహించి గడచిన నాలుగేళ్ల పది నెలల కాలంలో ప్రజలకు చేసిన మేలును వివరించడంతో పాటు ప్రజలకోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ముకుమ్మడి కుట్రను వివరిస్తున్నారు. అందులో భాగంగా నేడు చివరి సిద్ధం సభ బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడులో జరగనుంది. ఇందులో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుంచి పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు హాజరుకానున్నారు. చరిత్రలో నిలిచేపోయే ఈ సభలో పాల్గొనాలని పల్నాడు జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. జననేత సందేశం వినాలని ఆత్రుతతో ఉన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని ప్రతి ఇంటికీ చేర్చి మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడేలా చూడటమే లక్ష్యంగా నేడు వీరు సిద్ధం సభకు వెళ్లనున్నారు.

- గుంటూరు జిల్లాలో గుంటూరు పశ్చిమ నుంచి మంత్రి విడదల రజిని, తూర్పు నుంచి నూరి ఫాతిమా, తాడికొండ నుంచి మేకతోటి సుచరిత, ప్రత్తిపాడు నుంచి బలసాని కిరణ్‌కుమార్, తెనాలి నుంచి అన్నాబత్తుని శివకుమార్, మంగళగిరి నుంచి ఎమ్మెల్యే ఆర్కే, సమన్వయకర్త మురుగుడు లావణ్య, పొన్నూరు నుంచి అంబటి మురళీకృష్ణ, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య నేతృత్వంలో జన సమీకరణకు సన్నాహాలు పూర్తి అయ్యాయి. ఇప్పటికే వాహనాలు సిద్ధం చేశారు.
- పల్నాడు జిల్లాలో సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు, మాచర్ల నుంచి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గురజాల నుంచి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట నుంచి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పెదకూరపాడు నుంచి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వినుకొండ నుంచి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, చిలకలూరిపేట నుంచి సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో శ్రేణులు పెద్ద ఎత్తున సభకు తరలి వెళ్లడానికి సన్నద్ధం అవుతున్నారు.
- బాపట్ల జిల్లాలో బాపట్ల నుంచి ఎమ్మెల్యే కోన రఘుపతి, అద్దంకి నుంచి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి, రేపల్లె నుంచి సమన్వయకర్త ఈవూరి గణేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, చీరాల నుంచి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, సమన్వయకర్త కరణం వెంకటేష్, పర్చూరు నుంచి సమన్వయకర్త ఎడం బాలాజీ, వేమూరు నుంచి సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో శ్రేణులు కదం తొక్కనున్నాయి.



భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల, రేంజ్ ఐజీ పాలరాజు, ఎస్పీ వకుల్ జిందాల్

సొంత వాహనాల్లో ప్రయాణం

పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఇప్పటికే పలు మార్లు సిద్ధం సభ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి భారీ సంఖ్యలో ప్రజలు సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ అభిమానుల కోరిక మేరకు సభకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేశారు. మరికొంత మంది కార్యకర్తలు తాము సొంతగా వాహనాలు ఏర్పాటు చేసుకొని సభకు వెళ్లనున్నారు. వీటితో నేడు దారులన్నీ సిద్ధం సభ వైపునకు మళ్లాయి. ఇప్పటికే మంచి జోష్ మీద ఉన్న వైఎస్సార్ సీపీ క్యాడర్ నేడు సిద్ధం సభ వేదికగా సీఎం వైఎస్ జగన్ ఇచ్చే సందేశంతో మరింత పెరిగిన ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో పని చేసి, పార్టీ అఖండ విజయానికి కృషి చేయనున్నారు.



వేదిక వద్ద ఎమ్మెల్యే కరణం బలరాం, తలశిల, యెనుముల, మాదిరెడ్డి తదితరులు



ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

నగరంపాలెం: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలో ఆదివారం జరగనున్న 'సిద్ధం' సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరుకానున్నారు. సభకు ప్రజలు భారీగా తరలిరానున్నారు. అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు/ వాహనచోదకులకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇలా వెళ్లాలి..

- విజయవాడ, గుంటూరు నుంచి జాతీయ రహదారిపై ఒంగోలు, చెన్నై వైపు వెళ్లే వాహనాలు బుడంపాడు అడ్డరోడ్ మీదగా పొన్నూరు, బాపట్ల, చీరాల, త్రోవగుంట వైపుగా వెళ్లాలి.
- గుంటూరు నగరం నుంచి ఒంగోలు వెళ్లే వాహనాలు ఏటుకూరు జంక్షన్ నుంచి ప్రత్తిపాడు, పర్చూరు, ఇంకొల్లు, నాగులుప్పలపాడు, త్రోవగుంట వైపు వెళ్లాలి.
- గుంటూరు నుంచి నరసరావుపేట మీదుగా ఒంగోలు వెళ్లే వాహనాలు చుట్టుగుంట, పేరేచర్ల, ఫిరంగిపురం, నరసరావుపేట, సంతమాగులూరు అడ్డరోడ్డు జంక్షన్, అద్దంకి, మేదరమెట్ల మీదుగా వెళ్లాలి.
- 16వ నంబర్ జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్ ప్లాజా నుంచి బొల్లాపల్లి, మేదరమెట్ల వరకు ఎటువంటి వాహనాలకు అనుమతిలేదు. సిద్ధం సభ వాహనాలకు మాత్రమే అనుమతి. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి వాహనాల దారి మళ్లింపు అమల్లోకి వస్తోందని జిల్లా ఎస్పీ తెలిపారు.

చరిత్రలో చిరస్థాయిగా సిద్ధం సభ



ర్యాంప్‌ను పరిశీలిస్తున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన వైవీ, సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: సిద్ధం సభ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే విధంగా ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావాలని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి కోరారు. శనివారం కొరిశపాడు మండలం మేదరమెట్ల సమీపంలోని పీ గుడిపాడు వద్ద జరుగుతున్న సభా ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ నియోకవర్గంలోని ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి సీఎం జగనన్నను ఆశీర్వదించాలన్నారు. సభాస్థలిని చూడటానికే అద్దంకి నుంచి ప్రజలు తండోపతండాలు తరలి రావటం ఆనందంగా ఉందన్నారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. పెద్దఎత్తున లక్షలాది మంది వస్తున్నట్లు అంచనా వేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ప్రజాభిమానం సిద్ధం సభల ద్వారా తెలుస్తుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. గత సభలు సైతం ప్రజలు విజయవంతం చేశారన్నారు. ఈ సభకు లక్షలాది మందికి పైగా హాజరవుతున్నట్లు అంచనా వేస్తున్నామని చెప్పారు. మహిళామణులు సైతం సిద్ధం సభకు వచ్చేందుకు సమాయత్తం అవుతున్నారన్నారు. ఈసారి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని చెప్పారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ యువత

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకపాలన పట్ల ఆకర్షితులైన అద్దంకిలోని 19వ వార్డుకు చెందిన టీడీపీ యువ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మట్లపూడి బాజీవలి ఆధ్వర్యంలో పానెం చిన హనిమిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరందరికి సమన్వయకర్త కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జిల్లా టీడీపీ కార్యదర్శి షేక్ అబ్దుల్లా, పఠాన్ సల్మాన్ తదితరులు ఉన్నారు. వీరందరిని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.

సిద్ధం సభ ప్రాంగణాన్ని పరిశీలించిన వైవీ

మేదరమెట్ల: నేడు కొరిశపాడు మండలం పీ.గుడిపాడు సమీపంలో నిర్వహించనున్న సిద్ధం సభా ప్రాంగణాన్ని పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శనివారం రాత్రి పరిశీలించారు. సభా ప్రాంగణం ఏర్పాట్లు, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగం తరువాత ప్రజల వద్దకు వెళ్లి అభివాదం చేసే ర్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఉన్నారు.

పోలీసులు సమర్థంగా పనిచేయాలి

ఐజీ పాలరాజు



మాట్లాడుతున్న ఐజీ పాలరాజు, వేదికపై ఎస్పీలు వకుల్‌జిందాల్, తుషార్ డూడీ తదితరులు

మేదరమెట్ల: సిద్ధం సభను సజావుగా నిర్వహించేలా చూడాలని గుంటూరు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ పాలరాజు శనివారం రాత్రి పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఐజీ మాట్లాడుతూ కొరిశపాడు మండలం పీ.గుడిపాడు సమీపంలో ఆదివారం నిర్వహించే సభకు వచ్చే వాహనాలను వారికి కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వరుస క్రమంలో నిలిపి ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరినీ క్షుణంగా పరిశీలించిన తర్వాతే లోపలికి పంపించాలన్నారు. వాహనాలను దారి మళ్లించే వారు సంయమనం పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా ఉన్నతాధికారులతో వెంటనే సంప్రదించాలన్నారు. బందోబస్తు నిర్వహించేందుకు వచ్చిన పోలీసు సిబ్బందికి ఎప్పటికప్పుడు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. తొలుత సభా ప్రాంగణంలో నిర్వహించే భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ ఐజీ రవీంద్రనాథ్‌బాబు, ఎస్పీ వకుల్ జిందాల్, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఎస్పీలు తుషార్ డూడీ, పరమేశ్వరరెడ్డి, తిరుమలేశ్వరరెడ్డి, ఇతర ఐపీఎస్ అధికారులు బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రికోటేశ్వరుని ఆదాయం రూ.1.63 కోట్లు

నరసరావుపేట రూరల్‌: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ఆదాయం రూ.1,63,48,227 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.శ్రీనివాసరెడ్డి శనివారం రాత్రి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో హుండీ కానుకలు లెక్కించినట్లు చెప్పారు. పూజ టికెట్ల అమ్మకం ద్వారా రూ.54,99,638, ప్రసాదములు అమ్మకం ద్వారా రూ.35,92,950, అన్నదానం, ఇతర సేవలు, స్కీముల ద్వారా రూ.2,01,776, హుండీలు ద్వారా రూ.70,53,863 లభించిందన్నారు. స్వామి వారికి వెండి 506 గ్రాములు, బంగారం 49 గ్రాములు లభించిందని తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధికారి చంద్రకుమార్‌, ఉప కమిషనర్‌ వారి కార్యాలయం సూపరింటెండెంట్‌ శ్రీధర్‌రెడ్డి, దేవదాయశాఖ నరసరావుపేట పరిశీలకుడు మంజూష పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఆదాయం రూ.65.24 లక్షలు

నరసరావుపేట: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా రూ.65.24 లక్షలు ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్‌ బత్తుల వీరాస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ డిపోకు చెందిన బస్సుల ద్వారా ప్రయాణించిన 2.36లక్షల ప్రయాణికులు ప్రయణించినట్లు చెప్పారు. గతేడాది కంటే సుమారుగా రూ.12 లక్షల ఆదాయం తగ్గిందని వివరించారు. గతేడాది 2.72 లక్షల ప్రయాణికుల ద్వారా రూ.72.56 లక్షల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. బస్సులు ఈ ఏడాది 79 వేల కిలోమీటర్లు తిరగ్గా, గతేడాది 84వేల కిలోమీటర్లు తిరిగాయని చెప్పారు.

రేషన్‌ బియ్యం స్వాధీనం

ప్రత్తిపాడు: మిల్లుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసి, తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని భారీ మొత్తంలో పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్‌ చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. వట్టిచెరుకూరు మండలంలోని రైస్‌ మిల్లుల్లో పెద్దఎత్తున రేషన్‌ బియాన్ని నిల్వ చేసి అక్రమ వ్యాపారం చేస్తున్నారంటూ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులకు సమాచారం అందింది. జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలి, డెప్యూటీ తహసీల్దార్లు ఎం.పద్మజ, ఎ.శివశంకర్‌, పి.దుర్గారావు, ఐ.అనిల్‌కుమార్‌ మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు తనిఖీలు చేశారు. చమళ్లమూడిలోని పద్మజ రైస్‌మిల్లుకు చెందిన లారీలో బిల్లులు లేకుండా 300 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం రవాణా చేస్తుండటంతో లారీని నిలిపి తనిఖీ చేశారు. అందులో బియ్యం ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతవరప్పాడులోని శ్రీవల్లి రైస్‌ మిల్లుకు చెందిన లారీలో 250 క్వింటాళ్ల రేషన్‌ బియాన్ని గుర్తించి స్వాధీన చేసుకున్నారు. అనుమానం వచ్చిన అధికారులు సంబంధిత రైస్‌ మిల్లులో తనిఖీలు చేయగా మరో 200 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం నిల్వలను గుర్తించారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

- నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ
- నాగరాజుపల్లి తండాలో రైతులకు 109 ఎకరాల భూ పంపిణీ



నాగరాజుపల్లి తండాలో రైతులకు భూ పట్టాలు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త యడం బాలాజీ

మార్టూరు: రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని.. రైతాంగం సర్వతోముఖాభివృద్ధి కోసం సీఎం చేస్తున్న నిరంతర కృషికి మనం మరోసారి ఆయనకు మద్దతుగా నిలబడదామని వైఎస్సార్‌ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ పిలుపునిచ్చారు. మండలంలోని నాగరాజుపల్లి గ్రామం సుగాలితండాలో శనివారం రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయానికి అండగా ఉండడం కోసం తమ ప్రభుత్వం మట్టి నమూనాల పరీక్షలు మొదలు రైతుల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌ వరకు గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల్లో నష్టపరిహారం చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామని బాలాజీ అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి సేంద్రియ ఉత్పత్తులను పండించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఫల సాయాన్ని సాధించడం ద్వారా దేశం యావత్తు రాష్ట్రం వైపు చూసేలా చేయగలిగామని అన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా, పర్చూరులో వైఎస్సార్‌ సీపీ జండాను ఎగరవేయడం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. నాగరాజుపల్లి తండాలో మూడు దశాబ్దాలుగా భూ పట్టాల కోసం ఎదురు చూస్తున్న రైతుల చిరకాల స్వప్నం నేడు తన ద్వారా సాకారం దాల్చడం సంతోషంగానూ గర్వంగానూ ఉందని బాలాజీ అన్నారు. ఆయనకు తండా వాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం బాలాజీ గ్రామంలోని సర్వే నంబర్లు 420, 453, 454 ,455, 517, 518లోని 109 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించి 87 మంది రైతులకు శాశ్వత భూ యాజమాన్య హక్కు పట్టాలు పంపిణీ చేశారు. తండాలో రూ.33 లక్షల నిధులతో నిర్మించిన వాటర్‌ ప్లాంటు, డ్రైనేజీ కాలువలు బాలాజీ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు కె.సంధ్యశ్రీ, ఎంపీపీ భుక్యా శాంతిబాయి, గ్రామ సర్పంచ్‌ డాక్టర్‌ నరేంద్రబాబు, తండా నాయకులు రమావత్తు శ్రీనునాయక్‌, జఝావత్‌ పర్సానాయక్‌, భుక్యా గోవింద్‌ నాయక్‌, సొసైటీ అధ్యక్షుడు దివ్య కిషోర్‌, దాసం హనుమంతరావు, డీటీ శివ శ్రీను, ఆర్‌ఐ బాషా, వీఆర్‌వో రవి, మండల కన్వీనరు పఠాన్‌ కాలేషావలి, గర్నెపూడి రవిచందు, బాబూ నాయక్‌, పాలెపోగు రాంబాబు, కాకోలు రామారావు, మార్టూరు యద్దనపూడి మండలాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

‘సిద్ధం’ సభకు తరలి వెళదాం

వైఎస్సార్‌ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



సభకు ర్యాలీగా వస్తున్న సమన్వయకర్త వరికూటి

అద్దేపల్లి(భట్టిప్రోలు): అంతా సమష్టిగా పనిచేసి వేమూరులో మళ్లీ వైఎస్సార్‌ సీపీ జెండాను ఎగుర వేయాలని పార్టీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ‘సిద్ధం’ సన్నాహక సభలో అశోక్‌ బాబు మాట్లాడారు. ఆదివారం ప్రకాశం జిల్లా మేదరమెట్లలో జరగనున్న ‘సిద్ధం’ సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పలువురు యానాది కుటుంబీకులు, ముస్లిం మైనార్టీ కుటుంబాలు అశోక్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్‌ దారా రవి కిరణ్మయి, ఉప సర్పంచ్‌ బుర్లె రామ్‌ప్రసాద్‌, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, మండల కన్వీనర్‌ మోర్ల శ్రీనివాసరావు, వైస్‌ ఎంపీపీ కొరపు పిచ్చయ్యశాస్త్రి, వైఎస్సార్‌ సీపీ వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

గోవాడకు రెండో రోజూ పోటెత్తిన భక్తులు



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

అమర్తలూరు(వేమూరు) మహా శివరాత్రి మరుసటి రోజైన శనివారం గోవాడ బాలకోటేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారని ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్‌ ఆలపాటి రమాదేవి, ఉత్సవ కమిటీ ప్రత్యేకాధికారి అమర్నాద్‌, ఆలయ ఈవో ఈమని అశోక్‌రెడ్డి తెలిపారు. శివరాత్రి మరుసటి రోజు రాత్రి వరకు సుమారు రెండు లక్షల మంది భక్తులు బాలకోటేశ్వరస్వామిని దర్శించుకున్నారని తెలిపారు. శివరాత్రి రోజు గోవాడ పరిసర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లపై విద్యుత్‌ ప్రభలతో యువకులు, భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి దైవ దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మారుమ్రోగింది. ఆది, సోమవారం కూడా భక్తులు అధిక సంఖ్యలో గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి దర్శనార్థం వస్తారని ఈఓ తెలిపారు.

కారు బీభత్సం.. ఒకరి మృతి

గుంటూరురూరల్‌: కారు బీభత్సం సృష్టించి రోడ్డు పక్కన నివసించే కూలీలపై దూసుకెళ్లింది. ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నల్లపాడు పోలీస్‌స్టేషన్‌ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలుజిల్లా ఎమ్మిగనూరుకు చెందిన మల్లిపోగు సునీత(38), సందెపోగు లతలు తమ కుటుంబసభ్యులతో కలసి కూలి పనులు చేసుకుని జీవించేందుకు రూరల్‌ మడలంలోని అడవితక్కెళ్లపాడు వద్ద రోడ్డుపక్కన చిన్నపాటి డేరాను వేసుకుని జీవిస్తున్నారు. రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. ఆరు బయట సునీత, లతలు బట్టలు ఉతుక్కుంటూ కూర్చున్నారు. ఇంతలో అతి వేగంతో వస్తున్న కారు వీరిపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో సునీత తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, లతకు తీవ్రగాయాలై రెండుకాళ్లు కోల్పోయినట్లు తెలిసింది. మితిమీరిన వేగంతో కారు నడుపుతున్న వ్యక్తి, కారులో ఉన్న ముగ్గురు యువకులు మైనర్‌లుగా తెలిసింది. నగర శివారుల్లో ఒక కళాశాలలో బీటెక్‌ చదివే విద్యార్థులు కారు తీసుకుని సరదాగా డ్రైవింగ్‌ నేర్చుకునేందుకు వచ్చినట్లు తెలిసింది. డ్రైవింగ్‌ తెలియని యువకులు మితిమీరిన వేగంతో కారు నడిపి కూలీల బతుకులను చిదిమేశారని స్థానికులు, కుటుంబ సభ్యులు వాపోయారు. ముగ్గురు యువకులు మత్తులో ఉన్నారని విశ్వసనీయ సమాచారం. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో పందిళ్లపల్లి క్రీడాకారుడి ప్రతిభ

రెండో స్థానంలో మెరిసిన ప్రదీప్‌నాయుడు



పతకం, సర్టిఫికెట్‌ అందుకుంటున్న ప్రదీప్‌నాయుడు

వేటపాలెం: జాతీయ అథ్లెటిక్స్‌ పోటీల్లో పందిళ్లపల్లి క్రీడాకారుడు ఆర్‌ ప్రదీప్‌నాయుడు రెండో స్థానం సాధించాడు. కర్నాటక రాష్ట్రం ఉడిపిలో సౌత్‌ ఇండియా మాస్టర్‌ అథ్లెటిక్స్‌ ఓపెన్‌ చాంపియన్‌షిప్‌–2024 పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో 12 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని రెండో స్థానంలో నిలిచి సిల్వర్‌ పతకం సాధించాడు. పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి ఆరుగురు క్రీడాకారులు పాల్గొనగా కేరళ క్రీడాకారుడు మొదటి స్థానం సాధించగా, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రదీప్‌ రెండో స్థానంలో నిలిచాడు. మహారాష్ట్రకు చెందిన క్రీడాకారుడు మూడో స్థానం సాధించాడు. గతేడాది నవంబర్‌లో కర్నాటక రాష్ట్రంలోని ధార్వాడ్‌లో ఓపెన్‌ నేషనల్‌ మారథాన్‌ పోటీల్లో ప్రదీప్‌నాయుడు మూడో స్థానం సాధించాడు. ఈ పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం సాధించాడు. మొదటి స్థానం కేరళ, రెండో స్థానంలో తెలంగాణా నిలచింది. 2022లో నిర్వహించిన మారథాన్‌ పోటీల్లో 4–100 మీటర్లు పరుగు పందెం పోటీల్లో బంగారు పతకం సాధించాడు. క్రీడాకారుడిని స్నేహితులు, ప్రముఖులు అభినందించారు.

అరవపల్లి దేవాలయ ఆదాయం రూ.10.25లక్షలు



అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రేపల్లె రూరల్‌: మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయానికి రూ.10,25,601 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి రాజేశ్వరరావు చెప్పారు. స్థానిక అరవపల్లిలోని దేవస్థానంలో శనివారం హుండీ లెక్కింపు అనంతరం ఆయన మాట్లాడారు. హుండీ ఆదాయం రూ.4,97,256, టికెట్ల అమ్మకం ద్వారా రూ.1,51,540, కేశఖండన టికెట్ల అమ్మకం ద్వారా రూ.480, అభిషేకం టికెట్ల అమ్మకం ద్వారా రూ.1,50,700, ప్రసాదం అమ్మకం ద్వారా రూ.1,88,525, కొబ్బరి చిప్పల అమ్మకం ద్వారా రూ.28,000, నెయ్యి అమ్మకం రూ.9100 వచ్చినట్లు చెప్పారు. గత సంవత్సరంతో పోల్చితే స్వామివారి ఆదాయం రూ.1674 పెరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ లోయా బాబూ నాంచారయ్య, ఆలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వాహనం బోల్తా..

- ఆరుగురికి గాయాలు, ఒకరు అపస్మారక స్థితి
- యడ్లపాడు వద్ద హైవేపై ఘటన
- బాధితులంతా భద్రచలం వాసులే



అపస్మారక స్థితి వెళ్లిన బుజ్జి



యడ్లపాడు వద్ద హైవేపై పల్టీ కొట్టిన వాహనం



గాయాలైన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

యడ్లపాడు: తిరునాళ్లకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉన్న వాహనం డివైడర్‌ను ఢీకొంది. యడ్లపాడు వద్ద శనివారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా ఒకరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వివరాలు... భద్రాచలానికి చెందిన వారు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు బొలెరో వాహనంలో దర్శనానికి వచ్చారు. శుక్రవారం స్వామిని దర్శించుకుని రాత్రి కొండ వద్దే జాగారం చేసి శనివారం మధ్యాహ్నం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. యడ్లపాడు వంతెన వద్దకు రాగానే హైవే డివైడర్‌ను ఢీకొని వాహనం పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న బుజ్జి అనే మహిళ వాహనం నుండి రోడ్డుపై వచ్చి పడటంతో అపస్మారక స్థితికి వెళ్లింది. తోటి ప్రయాణికులైన తులసి, లక్ష్మి, చిన్నమ్మాయిలతో పాటు డ్రైవర్‌, క్లీనర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది బాధితుల్ని చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. వాహనంలో ప్రయాణిస్తున్న వారంతా క్యాటరింగ్‌ నిర్వాహకులని, డ్రైవర్‌ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.